


సోమవారం 13 జూలై 2026 పేజీలు : 8

# యంగ్ ఇండియా ప్రవేశ పరీక్షల నిర్వహణ పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య



యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్--2026 ప్రవేశ పరీక్షలను పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షా గదులు, హాజరు నమోదు, ప్రశ్నాపత్రాల పంపిణీ, ఇన్విజిలేషన్ విధానం తదితర ఏర్పాట్లను పరిశీలించారు.

## బృందావన్ కాలనీలో పోలీసుల ఆధ్వర్యంలో

# పోలీస్ అక్క అవగాహన సదస్సు

అదిలాబాద్ పట్టణం వార్డ్ నెంబర్.6 బృందా వన్ కాలనీలో రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వ ర్యంలో మహిళ లు, బాలికలు భద్రత గురించి ఆదివారం సాయంత్రం పోలీస్ అక్క కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ సుకన్య మాట్లాడుతూ బాలికలు లైంగిక నేరాల నుండి రక్షించే చట్టాన్ని ఫోక్సో చట్టం బాల్య వివాహాల నివారణ, మహిళలు మరియు పిల్లల భద్రత, బాలికలను ఎవరైనా పోకిరిలు వేధిస్తే షీ టీంకు సంప్రదించి ఫోన్ చేయాలని, బాలికల సమస్యలు, వారి పరిష్కారానికి మన తెలంగాణ ప్రభుత్వం పోలీస్ అక్క ను ఏర్పాటు చేసిందని, పోలీస్ అక్క అంటే మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా, మహిళా కానిస్టేబుల్ లను బృందంగా ఏర్పాటు చేసి పోలీస్ అక్క టీం గా 24 గంటలు బాలికలు మహిళల






# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెల రూ.10 వేల వేతనం చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) మంచిర్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నస్పూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.



# యంగ్ ఇండియా ప్రవేశ పరీక్షల నిర్వహణ పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య





ఓటరు జాబితా డిజిటలైజేషన్‌ను గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

**మంచిర్యాల, 12,జూలై (ప్రజాజ్యోతి):** యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్--2026 ప్రవేశ పరీక్షలను పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షా గదులు, హాజరు నమోదు, ప్రశ్నాపత్రాల పంపిణీ, ఇన్విజిలేషన్ విధానం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు తాగునీరు, విద్యుత్, పరిశుభ్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అభ్యర్థులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాండూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల పారదర్శకతను కాపాడుతూ అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తాండూరు గ్రామపంచాయతీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించారు. మండల పంచాయతీ అధికారి, డిప్యూటీ తహసీల్దార్, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శులతో కలిసి బూత్ స్థాయి అధికారులతో సమావేశమై పెండింగ్‌లో ఉన్న ఫారాలను ప్రాధాన్యతతో పూర్తి చేసి నిర్దేశిత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెన్నెల మండలంలోని నెన్నెల, ఆవడం, గంగారం గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పరిశీలించిన అదనపు కలెక్టర్, మండల తహసీల్దార్, ఉప తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించి గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీఎల్ఎలు సర్ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియ వేగవంతంగా చేయాలి అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య....



**తాండూర్ జూలై 12 ప్రజాజ్యోతి** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు ఆరు ఒకటో వార్డులలో నిర్వహించే సర్వే బిఎల్ఓల సెంటర్ లను పరిశీలించి ఎస్ ఐ ఆర్ నమోదు ప్రక్రియ వేగవంతంగా చేయాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య సూచించారు. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సహకరించి తమ వివరాలను దరఖాస్తు ఫారాల్లో నింపి వారికి సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కల్పన, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మజ ,ఎంపీ ఓ అనిల్ కుమార్ ,కార్యదర్శి దివాకర్ ,సర్పంచ్ ముడీ మడుగుల సురేష్, కాంగ్రెస్ నేతలు ఎండి ఈసా, ఆదం ఖాన్ ,పెట్టం విష్ణువ ర్ధన్ ,,బి.ఎల్ .ఏ లు విజయలక్ష్మి స్వరూప తదితరులు. ఉన్నారు..

## సర్ ప్రక్రియలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా పాల్గొనాలి

: డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క



**ఆసిఫాబాద్ జులై 12 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో జరుగుతున్న సర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో మొదటి దశ అయిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 100% పూర్తయిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారని డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి ఆత్రం సుగుణక్క తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఫారం పంపిణీ పూర్తయిన నేపథ్యంలో ఈరోజు నుండి ప్రతి ఊరిలో కాంగ్రెస్ పార్టీ తరపున హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ జాబితా వివరాలు మరియు ఫారం నింపడంలో ప్రజలకు సహాయం చేయాలని కోరారు. ప్రతి ఊరి, వాడ, మండల కేంద్రాల్లో డెస్క్‌లు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ ప్రక్రియలో విస్తృతంగా పాల్గొనాలని సుగుణక్క విజ్ఞప్తి చేశారు. ప్రతి ఊరు, వాడ, మండలం మరియు నియోజకవర్గ కేంద్రాల్లో తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు అయ్యేలా చూడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఇది కీలకమని, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత మనందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు.

## ఈపీఎఫ్‌కు 8.25%, సీఎంపీఎఫ్‌కు 7.6% వడ్డీ ఎందుకు?

బొగ్గు గని కార్మికులకు సమాన న్యాయం చేయాలి

ఆళవందార్ వేణు మాధవ్

**మంచిర్యాల, 12,జులై (ప్రజాజ్యోతి):** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై 2025--26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం 8.25 శాతం వడ్డీ రేటును కొనసాగించగా, కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్)పై 7.6 శాతం మాత్రమే వడ్డీ నిర్ణయించడం బొగ్గు గని కార్మికుల్లో ఆందోళన కలిగిస్తున్నదని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. ఈపీఎఫ్, సీఎంపీఎఫ్ రెండూ ఉద్యోగుల భవిష్య భద్రత కోసం ఏర్పాటు చేసిన పొదుపు పథకాలే అయినప్పటికీ, వడ్డీ రేట్లలో 0.65 శాతం వ్యత్యాసం ఎందుకు వస్తోందన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఈపీఎఫ్‌ను దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగుల నిధులతో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తుండగా, భారీ నిధుల కారణంగా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టి మెరుగైన రాబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. స్థిర ఆదాయ సాధనాలతో పాటు పరిమిత స్థాయిలో ఈక్విటీ పెట్టుబడులు కూడా ఉండటం వల్ల అధిక వడ్డీ ఇవ్వగలుగుతున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో సీఎంపీఎఫ్‌ను కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తుందని, ఇందులో సభ్యుల సంఖ్య, నిధుల పరిమాణం తక్కువగా ఉండటంతో పాటు పెట్టుబడులు ప్రధానంగా సురక్షిత సాధనాలకే పరిమితమవుతున్నా యని వివరించారు. అందువల్ల రాబడి కూడా తక్కువగా ఉండి 7.6 శాతం వడ్డీ మాత్రమే నిర్ణయించబడిందని తెలిపారు. 0.65 శాతం తేడా చిన్నదిగా కనిపించినప్పటికీ, దీర్ఘకాలిక పొదుపులపై దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని వేణు మాధవ్ పేర్కొన్నారు. ఉదాహరణకు రూ. 10 లక్షల నిల్వపై సంవత్సరానికి సుమారు రూ. 6,500 అదనపు ఆదాయం ఈపీఎఫ్ సభ్యులకు లభిస్తుండగా, అదే మొత్తాన్ని సీఎంపీఎఫ్ సభ్యులు కోల్పోతున్నారని అన్నారు. ఉద్యోగ జీవితాంతం ఈ వ్యత్యాసం లక్షల్లోకి చేరే అవకాశం ఉందని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధికి బొగ్గు గని కార్మికులు కీలకంగా సేవలందిస్తున్నప్పటికీ, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే వారికి తక్కువ వడ్డీ లభించడం సామాజిక న్యాయం, కార్మిక సంక్షేమం, సమాన అవకాశాల సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. సీఎంపీఎఫ్ పెట్టుబడి విధానాన్ని పారదర్శకంగా సమీక్షించి, భద్రతకు భంగం కలగకుండా పెట్టుబడులను విభిన్నీకరించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే వడ్డీ రేటు నిర్ణయ ప్రక్రియపై సభ్యులకు పూర్తి వివరాలు వెల్లడించాలని, ఈపీఎఫ్--సీఎంపీఎఫ్ సభ్యుల మధ్య అధిక వ్యత్యాసం లేకుండా విధానపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సీఎంపీఎఫ్ అధికారులను కోరారు. కార్మికుల కష్టానికి తగిన గౌరవం ఇవ్వాలంటే వారి పొదుపులకు కూడా న్యాయమైన రాబడి లభించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, అదే నిజమైన కార్మిక సంక్షేమం, అదే సమానత్వానికి ప్రతీక అని ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు.



# మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలి

**మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు సీఐటీయు నాయకులు**

**20 మందితో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) నూతన జిల్లా కమిటీ ఎన్నిక**


మంచిర్యాల, 12,జూలై (ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి నెల రూ.10 వేల వేతనం చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) మంచిర్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నస్పూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదని అన్నారు. రోజురోజుకు నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరుగుతున్నప్పటికీ విద్యార్థుల మధ్యాహ్న భోజన మెనూ చార్జీలను ప్రభుత్వం పెంచడం లేదని, కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.6 మాత్రమే చెల్లిస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గుడ్డు ధర రూ.8 వరకు ఉండటంతో మిగిలిన మొత్తాన్ని కార్మికులే భరిస్తున్నారని తెలిపారు. అదే విధంగా రెండు కూరలు వండాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నప్పటికీ అందుకు తగిన నిధులు కేటాయించడం లేదని అన్నారు. ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఉదయం అల్పాహార పథకానికి సంబంధించిన బిల్లులను ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఒక్కో కార్మికురాలికి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు బకాయిలు రావాల్సి ఉన్నాయని తెలిపారు. అలాగే గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను 60 సంవత్సరాల వయస్సు పేరుతో ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. 60




సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్‌తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల తమ వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షురాలు ఎండి కరీమా, జిల్లా కార్యదర్శి ఎండి రఫియా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ప్రతి కార్మికురాలికి నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, కోడిగుడ్లు, గ్యాస్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి మెనూ చార్జీని రూ.20కు పెంచాలని, కార్మికులందరికీ రూ.20 లక్షల బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఐడీ కార్డులు, కాటన్ యూనిఫాంలు అందించాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వంటగదులు నిర్మించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంట సామగ్రి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) మంచిర్యాల జిల్లా నూతన కమిటీని 20 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎండి కరీమా (చెన్నూరు), జిల్లా కార్యదర్శిగా ఎండి రఫియా (హాజీపూర్), ఉపాధ్యక్షులుగా గడ్డం లక్ష్మి (కన్నెపల్లి), మధునమ్మ (జైపూర్), రమాదేవి (బెల్లంపల్లి), కోశాధికారిగా సవిత (జైపూర్), సహాయ కార్యదర్శులుగా సరిత (భీమారం), మల్లక్క (తాండూరు), రబియా (లక్సెట్టిపేట) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బుచ్చమ్మ, సేపురి లక్ష్మి, లావణ్య, ఉమా, జ్యోతి, సుశీల, ఓదమ్మ, సుభద్ర, జ్యోతి తదితరులు ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణలో ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

మంచిర్యాల, 12, జూలై (ప్రజాజ్యోతి): ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు



తమ ఎన్యూమరేషన్ పత్రాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి శ్రీమతి నడిపెల్లి రాజకుమారి కూడా తమ ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ఓలకు సమర్పించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, ఆయన సతీమణి ఉదయశ్రీ దంపతులు కూడా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తమ ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసర మైన మార్పులు, చేర్పులు ఉంటే నిర్ణీత గడువులోగా పూర్తి చేయా లని వారు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సహకరించాలని వారు పిలుపునిచ్చారు.

## నకిలీ విత్తనాల దందా... అధికారుల కుమ్మక్కు!

**రైతును ముంచే నకిలీ విత్తనాల మాఫియా**

**తనిఖీలు ఎక్కడ? నకిలీ విత్తనాలు యథేచ్ఛ!**

**వ్యాపారులకు కొమ్ము... రైతుకు కన్నీరు**

**విజిలెన్స్ తనిఖీలు చేయకపోతే ఉద్యమం: సిపిఎం**

ఆసిఫాబాద్జులై 12 ప్రజా జ్యోతి జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల దందా యథేచ్ఛగా సాగుతోంది. కానీ వ్యవసాయ అధికారులు మాత్రం కళ్లు మూసుకుని వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ తీవ్రంగా ఆరోపించారు. వర్షాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా విత్తనాలు,




ఎరువులు కొనుగోలు చేస్తున్న తరుణంలో నకిలీ మాఫియా రెచ్చిపోతోందన్నారు. జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు తనిఖీలు చేస్తున్నామని చెప్పుకుంటున్నా ఒక్క నకిలీ కేసు కూడా బయటపడడం లేదని విమర్శించారు.

**రైతును ముంచే నకిలీ విత్తనాల మాఫియా**

అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నకిలీ విత్తనాలు కొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులతో కుమ్మక్కై అధికారులు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.

**విజిలెన్స్ తనిఖీలు చేయాలని డిమాండ్**

ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా అన్ని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్ శాఖ ద్వారా తక్షణమే తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడకపోతే సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన పెన్కాక్ సిలాట్ విద్యార్థులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అభినందనలు

మంచిర్యాల, 12,జూలై (ప్రజాజ్యోతి): మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్‌లో జూన్ 25 నుంచి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి 13 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం మంచిర్యాల జిల్లాకు గర్వకారణమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటి దేశానికి, రాష్ట్రానికి, మంచిర్యాల జిల్లాకు



మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రభుత్వంతో పాటు సమాజం బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని, మరిన్ని విజయాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ విజయానికి కృషి చేసిన కోచ్‌లు, తల్లిదండ్రులు, నిర్వాహకులను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పెన్కాక్ సిలాట్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాసరి రాజేశ్వర్, మాస్టర్ పోచంపల్లి వెంకటేష్, రాష్ట్ర టెక్నికల్ చైర్మన్ రంగు శ్రీనివాస్, కోశాధికారి మెయిన్ తదితరులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బిట్లు, కీలలు సప్లై చేయని సింగరేణిలో.. ఐఏఎస్‌ల పేరిట లక్షల నజరానాలా?

**కార్మికుల అవసరాలకు నిధులు లేవు..**

**ప్రచార కార్యక్రమాలకు కోట్ల ఖర్చులా?**

**ఆర్థిక అరాచకంపై ఏఐటీయూసీ తీవ్ర ఆగ్రహం**



**మంచిర్యాల, 12, జులై (ప్రజా జ్యోతి):** గనుల్లో కార్మికులకు అవసరమైన కనీస పనిముట్లు, భద్రతా పరికరాలు కూడా అందుబాటులో లేకపోయినా, “ఐఏఎస్‌ల” పేరిట లక్షల రూపాయల నజరానాలు ప్రకటించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి భాజీ సైదా ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. గత రెండు నెలలుగా గనుల్లో అత్యవసరంగా అవసరమయ్యే డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్, కీలలు, పట్టీలు, గిర్మిట్లు, స్మాల్ మ్యాన్ క్లిప్స్, నాణ్యమైన సేఫ్టీ బూట్లు, గ్లౌజులు, హెల్మెట్లు, వామ్ కోట్లు, సర్వేయర్లకు అవసరమైన పరికరాలు, ఎస్‌డీఎల్ యంత్రాల విడిభాగాలు, టెక్నీషియన్లకు అవసరమైన ఆధునిక పనిముట్లు అందుబాటులో లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా బొగ్గు ఉత్పత్తి దెబ్బతినడమే కాకుండా గనుల్లో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి ఇంధనాన్ని అందిస్తున్న కార్మికుల భద్రతకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతుండగా, సంబంధం లేని కార్యక్రమాలపై లక్షలు, కోట్లు ఖర్చు చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు. ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలు, జాబ్ మేళాలు, క్రీడా ఈవెంట్లు, ఫుట్‌బాల్ కార్యక్రమాలు, ఇప్పుడు ఐఏఎస్‌ల పేరిట నజరానాలు వంటి అంశాలపై భారీగా వ్యయం చేయడం సంస్థ ఆర్థిక పరిస్థితిని మరింత బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి రాయల్టీలు, సెస్సులు, పన్నుల రూపంలో భారీ మొత్తాలు చెల్లిస్తున్న సింగరేణికి రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలు విడుదల కాకపోవడం వల్ల సంస్థపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. ఒకవైపు రావాల్సిన నిధులు నిలిపివేస్తూ, మరోవైపు సంస్థ నిధులను రాజకీయ అవసరాలకు వినియోగించడం వల్ల సంస్థ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని తెలిపారు. రాజకీయాలు సింగరేణిలో ప్రవేశించిన నాటి నుంచే సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటోందని, ఉత్పత్తి కంటే ప్రచారానికే, కార్మిక సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన సింగరేణిని రాజకీయ వేదికగా మార్చడం, అధికార ప్రచార సాధనంగా వినియోగించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం రాజకీయ జోక్యం, ఆర్థిక దుర్వినియోగం, ప్రణాళికా లోపాలు, కార్మిక సమస్యల పట్ల నిర్లక్ష్యం కారణంగా సంస్థ భవిష్యత్తు ఆందోళనకరంగా మారుతోందన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, డిపెండెంట్ ఉద్యోగాలు, పదోన్నతులు, అవసరమైన యంత్రాలు, విడిభాగాల కొనుగోళ్లు చేపట్టాలని, గనుల్లో పనిముట్లు, భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచాలని, సంస్థకు రావాల్సిన ప్రభుత్వ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు, ఆర్థిక అరాచకం, రాజకీయ జోక్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి భాజీ సైదా ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు.

## వరుస నేరాలకు పాల్పడుతు న్న ఫిర్దోష్ ఏ కడ్డు ఏ కదీమ్ ఖాన్‌పై పీడీ యాక్ట్ నమోదు

**ఇప్పటివరకు 25 కేసుల్లో నిందితుడు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా**

**హత్య, ఇంటి చోరీలు, దొంగత నాలు, దోపిడీ, బెదిరింపులు, శారీరక దాడుల కేసుల్లో ప్రధాన నిందితుడు**

**పదేపదే నేరాలకు పాల్పడు తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న నిందితుడిపై కఠిన చర్య**

**ఇప్పటికే జైలులో ఉన్న నిందితునికి పీడీ యాక్ట్ పత్రాలు**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 12,( ప్రజా జ్యోతి)** ఫిర్దోష్ ఏ కడ్డు ఏ కదీమ్ ఖా న్ (29) గుల్ మహమ్మ ద్, బంగారి గూడ గ్రామం, ఆ దిలాబాద్ మండలం పై పిడి యాక్ట్ నమోదైంది. ఆదిలాబా ద్ జిల్లా పరిధిలో వరుసగా హత్యలు, ఇంటి చోరీలు, దొంగత నాలు, దోపిడీలు, బెదిరింపు లు, శారీరక దాడులకు పాల్ప డుతూ ప్రజల్లో భయభ్రాంతు లు సృష్టిస్తున్న ఫిర్దోష్ ఏ కడ్డు ఏ కదీమ్ ఖాన్ పై పీడీ యాక్ట్ (ౡతీవజువత్‌ఱజువ ఐవ్‌వత్‌ఱశీఅ ూమ్‌) నమోదు చేసినట్లు ఆది లాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. ఆయన తె లిపి న వివరాల ప్రకారం, నింది తుడిపై ఇప్పటివరకు దాదా పు 25 కేసులు నమోదు అయ్యాయి. వీటిలో హత్య కేసులు, ఇంటి చోరీలు దొంగతనాలు, దోపిడీ, బలవంతపువ సూళ్లు (ఎక్స్‌టార్షన్ ), శారీ రక దాడులకు సంబంధించిన కేసులు ఉన్నాయి. పలు కేసు ల్లో అరెస్టై జైలు శిక్ష అనుభ వించినప్పటికీ, విడుదల అ నంతరం తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేకుండా మళ్లీ నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తు న్నాడు. నిందితుడిపై గతంలో ఆదిలాబాద్ వన్‌టౌన్, ఆదిలా బాద్ రూరల్, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లలో వివిధ నేరాలకు సంబంధించి కేసులు నమో దు కాగా, కొన్ని కేసుల్లో కోర్టు ద్వారా శిక్ష పడింది, మరికొన్ని కేసులు విచారణలో ఉన్నాయి. ఇటీవల కూడా వరుసగా కొత్త నేరాలకు పాల్పడిన నేపథ్యంలో, ప్రజల శాంతిభద్రతలకు ముప్పుగా మారిన అతని పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజ




ల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీ ఎస్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ నిందితుడిపై పీడీ యా క్ట్ నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న నిందితునికి అక్కడే పీడీ యాక్ట్ పత్రాలను అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా మాట్లా డుతూ, ప్రజల ప్రశాంత జీవ నానికి భంగం కలిగించే విధంగా పదేపదే నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరాలను ఏమాత్రం ఉపేక్షిం చబోమని, అనుమానాస్పద వ్యక్తులు లేదా నేర కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సైవి విష్ణువర్ధన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్ద గ్రామపంచాయతీలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహణ




**కెరమెరి జూలై 12 ప్రజా జ్యోతి** కెరమెరి మండలం పార్ద గ్రామపంచాయతీలో ఆదివారం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు సంబంధించిన వివరాలను సేకరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమాచారం నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవి చిత్రరేఖ, బీఎల్ఓ ఆత్రం సురేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సర్పంచ్ మాధవి చిత్రరేఖ సూచించారు.

## కృతజ్ఞతతో సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

**మాంగ్ కుల ధృవీకరణ పత్రాల అధికారం తహశీల్దార్‌కు...**

**మాంగ్ సమాజ్ హర్షం**




**కెరామేరి జులై 12 ప్రజా జ్యోతి** మాంగ్ సమాజ్ ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. రాష్ట్రంలో మాంగ్ కులం ఉనికిని కాపాడుతూ, మాంగ్ కులానికి కుల ధృవీకరణ పత్రం జారీ చేసే అధికారాన్ని తహశీల్దార్‌కు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మాంగ్ సమాజ్ కెరామేరి మండల కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతా కార్యక్రమం నిర్వహించారు.సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు మాంగ్ సమాజ్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ మాట్లాడుతూ ఇక నుంచి మాంగ్ కులం పేరుతో తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు జారీ కాకుండా చూసే బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారని మాంగ్ సమాజ్ ఆసిఫాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షులు శ్రీ మోహాలే దత్త మాంగ్ గుర్తుచేశారు.ముఖ్య అతిథిగా రాథోడ్ రమేష్ ఈ కార్యక్రమానికి జిల్లా మానవ హక్కుల కమిటీ అధ్యక్షులు రాథోడ్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బి. సాగర్ మాంగ్, ఎం. అంకుష్ మాంగ్, డి. ఆకాష్ మాంగ్, ఎం. శ్రీహరి మాంగ్, జి. తిరుపతి మాంగ్, కె. భుజంగ్ మాంగ్, డి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిగారికే షాక్..

సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మారువేషంలో బయలుదేరిన కర్ణాటక రవాణా శాఖ మంత్రి భైరతి సురేశ్‌కు చేదు అనుభవం ఎదురైంది. టికెట్ కోసం చిల్లర లేకపోవడంతో ఓ బీఎంటీసీ బస్సు కండక్టర్ ఆయన్ను బస్సు దిగిపొమ్మన్నారు. ఈ సంఘటన బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే..!**

మంత్రి భైరతి సురేశ్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన మాస్క్ ధరించి, సాధారణ ప్రయాణికుడిలా హెబ్బాల్ నుంచి నాగశెట్టిహళ్లి వెళ్లేందుకు బీఎంటీసీ బస్సు ఎక్కారు. రెండు టికెట్లు కొని, కండక్టర్‌కు రూ. 100 నోటు ఇచ్చారు. అయితే, కండక్టర్ చిల్లర ఇవ్వాలని అడగ్గా, తన వద్ద లేదని మంత్రి బదులిచ్చారు. దీంతో తన వద్ద కూడా చిల్లర లేదని, సరిగ్గా డబ్బులు చెల్లించలేకపోతే బస్సు దిగిపోవాలని కండక్టర్ స్పష్టం చేశారు. మంత్రి మాస్క్ ధరించి ఉండటంతో కండక్టర్ ఆయన్ను గుర్తుపట్టలేకపోయారు. దీనిపై మంత్రి ఏమీ మాట్లాడకుండా మౌనంగా బస్సు దిగిపోయారు. అనంతరం నాగశెట్టిహళ్లి నుంచి కొద్ది దూరం ప్రయాణించేందుకు మంత్రి ఓ ఆటో ఎక్కారు. మీటర్‌లో ఛార్జీ రూ. 30 చూపించగా, డ్రైవర్ రూ. 36 డిమాండ్ చేశాడు. ఎందుకని ప్రశ్నించగా.. మీటర్‌ను త్వరలో సరిచేయిస్తానని సమాధానమిచ్చాడు. చివరికి మంత్రి అతనికి రూ. 40 ఇచ్చి ఆటో దిగారు. ఈ తనిఖీ ద్వారా ప్రజా రవాణాలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను మంత్రి స్వయంగా తెలుసుకున్నారు.

## వచ్చేస్తోంది బుల్లెట్ ట్రైన్..

భారతదేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ సేవలు 2027 ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) కారిడార్‌లో భాగంగా సూరత్-బిలిమోరా మధ్య తొలి సర్వీసును నడపనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మార్గం దేశంలోనే మొట్టమొదటి హై-స్పీడ్ రైలు మార్గంగా నిలవనుంది. 508 కిలోమీటర్ల పొడవైన ముంబై-అహ్మదాబాద్ కారిడార్‌ను దశలవారీగా ప్రారంభిస్తారు. సూరత్-బిలిమోరా సెక్షన్ ప్రారంభమైన తర్వాత, మిగిలిన మార్గాలైన వాపి-సూరత్, వాపి-అహ్మదాబాద్, అహ్మదాబాద్-థానే, చివరగా పూర్తిస్థాయిలో అహ్మదాబాద్-ముంబై మార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకునేందుకు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు రెండు ఆర్థిక రాజధానుల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, కారిడార్ వెంబడి ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు. ఈ సందర్భంగా దేశంలో హై-స్పీడ్ రైల్వే నెట్‌వర్క్‌ను విస్తరించే ప్రణాళికలను కూడా వైష్ణవ్ వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా మూడు కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. పుణె-హైదరాబాద్, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు మార్గాలు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు దక్షిణాది రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచుతాయి. వీటితో పాటు హైదరాబాద్-ముంబై మధ్య కూడా మరో హై-స్పీడ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ నగరానికి మూడు హై-స్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లను కేటాయించారు. ఇవి నగరం రూపురేఖలను పూర్తిగా మారుస్తాయి" అని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈ నెట్‌వర్క్ తెలంగాణలోని అనేక జిల్లాల మీదుగా ప్రయాణిస్తూ, రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తుందని తెలిపారు. ఇదే సమయంలో 'నవ్-నిర్మాణ్' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 261 రైల్వే స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో సికింద్రాబాద్, బేగంపేట్, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లను ఈ పథకం కింద ఆధునికీకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

## కుమారుడితో మహిళ అదృశ్యం.. కేసు నమోదు

**9వ తేదీ నుంచి ఆచూకీ లేదు**



కెరామేరి జులై 12 ప్రజా జ్యోతి కుమారుడితో కలిసి ఓ మహిళ అదృశ్యమైన సంఘటన కలకలం రేపింది.కెరామేరి మండలం కొలం కొరారి గ్రామానికి చెందిన ఆత్రం పొచుబాయ్, 30 అనే మహిళ గత కొన్ని రోజులుగా కుమారుడు రాకేష్, 3 తో కలిసి కనిపించకుండా పోయింది.జూలై 9న ఇంటి నుంచి వెళ్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 9వ తేదీ ఉదయం ఇంటి నుంచి కుమారుడితో కలిసి బయటకు వెళ్లిన పొచుబాయ్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో మహిళ తండ్రి కెరామేరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చూకీ కోసం విజ్ఞప్తి సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు కెరామేరి ఎస్ఐ 87126 70530 లేదా వాంకిడి సిఐ 8712670509 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## అక్టోబర్ 27న ఇజ్రాయేల్‌లో ఎన్నికలు.. నెతన్యాహు ప్రభుత్వానికి ఆఖరి రోజు అదే..!

పశ్చిమాసియాలో యుద్ధం, అస్థిర పరిస్థితులు కొనసాగుతుండగానే ఇజ్రాయేల్‌లో సార్వత్రిక ఎన్నికలకు తెరలేవనుంది. ఈ ఏడాది అక్టోబర్ 27న ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ ప్రభుత్వం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నందున ఎలక్షన్లకు సమయం వచ్చిందని ఆదివారం ఇజ్రాయేల్ మీడియా తెలిపింది. నెతన్యాహు ప్రభుత్వం జూలై 17 వరకే కొనసాగనుంది. ఇజ్రాయేల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం మరో నాలుగు రోజులే ఉండనుంది. దాంతో, అధికార లికుడ్ పార్టీ సీనియర్ నాయకుడు అఫిర్ కట్జ్ టైమ్స్ ఇజ్రాయేల్ వార్త సంస్థతో మాట్లాడుతూ.. అక్టోబర్ 27న ఎన్నికలు ఉంటాయని వెల్లడించాయి. 1988 తర్వాత షెడ్యూల్ ప్రకారం నాలుగేళ్లకు జరుగనున్న మొట్టమొదటి ఎన్నికలు ఇవే. అంతేకాదు గత 50 ఏళ్లలో పూర్తికాలం అధికారంలో కొనసాగిన ప్రభుత్వంగా బెంజమిన్ నెతన్యాహు సర్కార్ గుర్తింపు సాధించనుంది.

**జూలై 17 నుంచే**

జూలై 17 నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా సెప్టెంబర్ 7 కల్లా సిద్ధం కానుందని ఇజ్రాయేల్ మీడియా పేర్కొంది. 120 ఎంపీ స్థానాలకు 61 సీట్లు గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయితే.. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీకి, గడి ఐసెన్‌కోట్ సారథ్యంలోని యషార్ పార్టీకి ఎన్నికల్లో తలా 23 సీట్లు వస్తాయని ఓ మీడియా సంస్థ అంచనా వేసింది. మరో సంస్థ మాత్రం ఐసెన్‌కోట్ పార్టీకి సంపూర్ణ ఆధిపత్యం లభిస్తుందని తెలిపింది.

## ఇరాన్ ప్రతీకార చర్యలు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ

## ఆపదలో ఉన్న కుటుంబానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ అండ.



మందమర్రి, జూలై 12(ప్రజాజ్యోతి ): ప్రమాదంలో కాలు విరిగి ఉపాధి కోల్పోయిన ఎండి పాషా కుటుంబానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానికుల సమాచారం మేరకు స్పందించిన సొసైటీ సభ్యులు పోగుల ఆంద్రూ, అమ్మన్ ఇసాక్ సహకారంతో ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, ఎండి జావిద్ ఖాన్, ఎండి జావిద్ పాషా, శ్రీనివాస్, మామిడి అజయ్ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

## బృందావన్ కాలనీలో పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ అక్క అవగాహన సదస్సు






అదిలాబాద్ టౌన్, జూలై 12 ( ప్రజా జ్యోతి )అదిలాబాద్ పట్టణం వార్డ్ నెంబర్.6 బృందావన్ కాలనీలో రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలు భద్రత గురించి ఆదివారం సాయంత్రం పోలీస్ అక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ సుకన్య మాట్లాడుతూ బాలికలు లైంగిక నేరాల నుండి రక్షించే చట్టాన్ని పోక్సో చట్టం బాల్య వివాహాల నివారణ, మహిళలు మరియు పిల్లల భద్రత, బాలికలను ఎవరైనా పోకిరిలు వేధిస్తే షీ టీంకు సంప్రదించి ఫోన్ చేయాలని, బాలికల సమస్యలు, వారి పరిష్కారానికి మన తెలంగాణ ప్రభుత్వం పోలీస్ అక్క ను ఏర్పాటు చేసిందని, పోలీస్ అక్క అంటే మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా, మహిళా కానిస్టేబుల్ లను బృందంగా ఏర్పాటు చేసి పోలీస్ అక్క టీం గా 24 గంటలు బాలికలు మహిళల భద్రతకు అందు బాటు లో ఉందని, అపరిచిత నంబర్ల నుండి ఫోన్ వచ్చిన బాలికలు, మహిళలకు ఏదైనా సమస్య ఉన్న పోకిరీలు వేధించిన పోలీస్ అక్క నంబర్ 8712659953 ను సంప్రదించాలని వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పింది. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, బాలికలు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు. కాలనీ అధ్యక్షులు గడ్డం అశోక్ మాట్లాడుతూ సమాజంలో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా బాలికల తల్లులు వారి పిల్లల పట్ల ప్రత్యేకంగా నిఘా ఉంచాలని, బాలికలకు స్వేచ్ఛ ఇవ్వాలి కానీ బాలికల ఫోన్ లో లాక్ ఉండకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వారి మొబైల్ ను పరిశీలించాలని, పిల్లలు మంచి మార్గంలో ప్రయాణించే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు.